ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

పోతుగల్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో అపర్ణ

షాబాద్, డిసెంబర్ 17 : గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్, ముద్దెంగూడ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. సర్వేపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాసే కుట్ర

పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మొయినాబాద్, డిసెంబర్ 17 : కార్మికుల హక్కులను కాలరాసే కుట్ర కాంగ్రెస్ సర్కార్ చేస్తున్నదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మంగళవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను పోలీసులు ముందోస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయడం రేవంత్ సర్కార్‌తో కాదని దేవేందర్ హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం, మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడు మాణిక్యం పాల్గొన్నారు.

కమిషనర్, టీపీవోలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ఏవో సునీల్ నాతానికి ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 17 : మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్ కోరారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, టీపీవోలు.. వైస్ చైర్‌పర్సన్ భర్త చామ విజయ్‌శేఖర్‌రెడ్డి కనుసన్నల్లో పనిచేస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని విన్నవించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న గోదాములపై గతంలోనే ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కమిషనర్ కంటితుడుపు చర్యలతో సరిపెట్టారన్నారు. విజయవాడ హైవేకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు, గోదాములు నిర్మించుకున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వివరించారు. కుంట్లూరు రెవెన్యూ సర్వే నం.185లోని చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నుంచి వైస్ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల భూమి వరకు 40 ఫీట్ల రోడ్డును చేపడుతున్నారని, దీనికి మున్సిపల్ కౌన్సిల్‌లో తప్పుడు తీర్మానం చేయించి రూ.20 లక్షలు మంజూరు చేసి కమిషనర్ సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టీఎల్‌లో వేసిన రోడ్డును తొలగించి, చెరువును కాపాడాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలని, టీపీవో అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేండ్లు జైలు శిక్ష

దర్శనాల బాల్‌రాజ్

షాబాద్, డిసెంబర్ 17 : ద్విచక్ర వాహనంపై ఓ బాలుడిని ఎక్కించుకుని, రోడ్డుపైన అజాగ్రతగా వాహనం నడిపి బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి కోర్టులో ఏడేండ్లు జైలు శిక్ష పడింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. షాబాద్ మండలంలోని అంతారం గ్రామానికి చెందిన దర్శనాల బాల్‌రాజ్ అనే వ్యక్తి 03-12-2020న తన ద్విచక్ర వాహనంపై ఓ బాలుడిని ఎక్కించుకుని సర్దార్‌నగర్‌కు వెళ్తున్నాడు. వాహనాన్ని అజాగ్రతగా, అతి వేగంగా నడపడంతోపాటు వస్తున్న లారీని చూసుకోకుండా లారీ ముందుకి వెళ్లడంతో వెనుక కూర్చున్న బాలుడు రోడ్డుపై కింద పడి మృతిచెందాడు. అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో నేరం రుజువు కావడంతో బాల్‌రాజ్‌కు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

చేవెళ్ల మండల పరిధి ఊరెల్ల జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్ మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలన్నారు. - చేవెళ్ల రూరల్, డిసెంబర్ 17

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వెంకటేశ్, దశరథ్‌నాయక్, నర్సింహగౌడ్

కడ్తాల్, డిసెంబర్ 17 : మంగళవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్-రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్, కామినేని దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 312 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యుడు అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ నర్సింహ గౌడ్, నాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల

యాచారం, డిసెంబర్ 17 : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను అధికారులు మంగళవారం విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంతోపాటుగా మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో పోలింగ్ స్టేషన్‌ల తుది జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ మహేందర్ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రదర్శిస్తున్న మండల పరిషత్ సూపరింటెండెంట్ శైలజ తదితరులు

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాల అందజేత

మొయినాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్ : లగచర్ల అన్నదాతలను అన్యాయంగా అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేసి వారి కుటుంబాలను రేవంత్‌రెడ్డి సర్కార్ రోడ్డుపాలు చేసిందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, సుమన్, పద్మయ్య, రవి, ఆసిఫ్, యాదగిరి, షరీఫ్, రవి ఉన్నారు.

నిర్బంధానికి గురిచేయడం దారుణం

మంచాల : లగచర్ల రైతులకు బేడీలు వేసి నిర్బంధానికి గురిచేయడం దారుణమని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంచాల మండల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు చంద్రయ్య, బహదూర్‌నాయక్, కిషన్‌రెడ్డి, నర్సింగ్, వెంకటేశ్, ఇందిర, అనిత, జగన్‌రెడ్డి, బద్రీనాథ్‌గుప్తా, విజయ్, శంకర్, బుచ్చయ్య, ప్రశాంత్, జంగయ్య, అమరేందర్‌రెడ్డి, అశోక్, శ్రీకాంత్ ఉన్నారు.

మంచాలలో..

ఆమనగల్లులో..

ఆమనగల్లు : రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గతంలో ఏర్పాటు చేస్తామన్న ఫార్మా కంపెనీ కోసం భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గిరిజన రైతన్నలపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నేనావత్ అనురాధ అన్నారు. ఆమనగల్లులో ఎంపీడీవో ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, సీనియర్ నాయకులు ఖలీల్, బాలస్వామి, శ్రీనూ నాయక్, పంతూనాయక్, పరమేశ్, రమేశ్‌నాయక్, సాయిలు, రమేశ్, శివకుమార్, సైదులు, గణేశ్, శంకర్, శివ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

కడ్తాల్‌లో..

కడ్తాల్ : లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, లక్ష్మి, మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, ప్రియ, మంజుల, నాయకులు మహేశ్, పాండు, గోపాల్, రవి, రాజు, బాబా, రమేశ్, మల్లేశ్, పవన్, అంజి, శ్రీకాంత్, శ్రీను, మోబీన్, అమ్జాద్, వెంకటేశ్, వినోద్, రవికుమార్, సుమన్, కృష్ణ, గోపాల్, రాజశేఖర్, రాములు, సురేశ్, ధర్మా, కోట్యా, జంగయ్య పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

చేవెళ్ల రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శంకర్‌పల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, ఫరీద్, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణు, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

అరెస్ట్ చేయడం సరికాదు

చేవెళ్లటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులను దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ప్రసాద్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎల్లయ్య, సత్యనారాయణచారి, మైనార్టీ నాయకులు ఘనీ, ఆరిఫ్, మండల నాయకులు కృష్ణ, శేఖర్‌రెడ్డి, విఘ్నేశ్ గౌడ్, శేఖర్, మాణిక్యారెడ్డి, మహేందర్, రాజు, రాఘవేందర్‌రెడ్డి, రాంప్రసాద్, మల్లేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

ఇబ్రహీంపట్నంరూరల్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నియంత పాలన సాగిస్తున్నదని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, అరవింద్, వీరేశ్, ప్రేమ్, కరుణాకర్, మహేశ్, గోపాల్, మైసయ్య, అంజయ్య, మహేందర్, మహేశ్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఆదిబట్ల అభివృద్ధికి రతన్ టాటా కృషి మరువలేనిది

ఆదిబట్ల, డిసెంబర్ 17 : ఆదిబట్ల అభివృద్ధికి రతన్ టాటా చేసిన కృషి మరువలేనిదని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి ఆదిబట్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. టీసీఎస్ ఆదిబట్ల జంక్షన్ మీదుగా నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రోడ్డును సెంట్రల్ లైటింగ్ సిస్టంతో ఏర్పాటు చేసి ఈ రోడ్డు మార్గానికి రతన్ టాటా పేరు పెట్టాలన్నారు. అదేవిదంగా టీసీఎస్ ఆవరణలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనికి టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో మంత్రి శ్రీధర్‌బాబుకు సమాచారం అందించారని పేర్కొన్నారు.

చేవెళ్ల మండల పరిధి తల్లారం అనుబంధ గ్రామం దుద్దాగులోని ఎబ్రోన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. అనంతరం అంతారం గ్రామానికి చెందిన ఆర్ ఎంపీ వైద్యుడు బేగరి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, బీరెలు పంపిణీ చేశారు. చేవెళ్ల రూరల్, డిసెంబర్ 17

పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 17 : తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ తండ్రి జంగయ్యయాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్ మంగళవారం ఉదయం వెల్జాల్ గ్రామంలో జంగయ్యయాదవ్ నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో జైపాల్‌యాదవ్ పాల్గొని పాడె మోశారు. పరామర్శించినవారిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రెహ్మాన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రజాచైతన్య సమితి యూత్ అధ్యక్షుడిగా సాయికుమార్

షాబాద్, డిసెంబర్ 17 : ప్రజా చైతన్య సమితి షాబాద్ మండల యూత్ అధ్యక్షుడిగా క్యామ సాయికుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు తెలిపారు. మంగళవారం షాబాద్‌లో ప్రజా చైతన్య సమితి సమావేశం నిర్వహించారు. అనంతరం మండల యూత్ అధ్యక్షుడిగా కుమ్మరిగూడ గ్రామానికి చెందిన క్యామ సాయికుమార్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల యూత్ అధ్యక్షుడి పదవి అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలియజేస్తూ, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి విఠలయ్య పాల్గొన్నారు.

సాయికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే స్థలం, నిధుల కేటాయింపు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 17 : మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో ఐపీఎస్ అధికారి శివధర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవతో అమేజాన్ కంపెనీవారి ప్రత్యేక సహకారంతో గతంలోనే గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు స్థలంతోపాటు నిధులు కూడా కేటాయించటం జరిగిందని తులేకలాన్ మాజీ సర్పంచ్ చిలుకల యాదగిరి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినట్లు చిత్రీకరించుకోవడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో యువత చెడు వ్యవసనాలకు అలవాటు పడకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరి తదితరులు

కొత్తూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక

కొత్తూరు, డిసెంబర్ 17 : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో అరుంధతి ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా జరిగిన పనులపై ఈ తనిఖీలు నిర్వహించారు. మండలంలో ఎన్ని పనులు జరిగాయి? అందులో ఎంత మంది కూలీలు పాల్గొన్నారు? వేతనం ఎలా చెల్లించారు? అలాగే జాబ్ కార్డులు కలిగి ఉన్నవారు ఎన్ని రోజులు పనుల్లో పాల్గొన్నారు? తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ప్రెసిడెంట్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డి, ఏపీడీ చేవెళ్ల అంబుడ్స్‌మన్ సునీతా మూర్తి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు ఉన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనునిత్యం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పని చేస్తుందని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. మంగళవారం చేవెళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను అవిష్కరించారు. ఏబీవీపీ 43వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించడం జరుగుతుందన్నారు. - చేవెళ్లటౌన్, డిసెంబర్ 17

హైదరాబాద్ బీజాపూర్ హైవేపై మరో ప్రమాదం

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 17 : హైదారాబాద్ బీజాపూర్ రహదారిపై రోడ్డు ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఆలూర్ గేట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగి రెండు వారాలు గడవకముందే మంగళవారం మరో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. ఆటో డ్రైవర్‌కు గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తొందరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పి విలేకరుల సమావేశాలు నిర్వహించి మరీ హామీల మీద హామీలు ఇవ్వడమే తప్పా చేసిందేమీలేదని, పోయేది ప్రజల ప్రాణాలే కదా.. మాకేంటి అన్నవిధంగా ఉన్నదని ప్రయాణికులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీజాపూర్ హైవే నిర్మాణం శరవేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 17 : చేవెళ్ల మండల పరిధి కందవాడ గ్రామంలో సీపీఐ పార్టీ 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కందవాడలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సీపీఐ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకుడు వెంకటయ్య, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఆశా వర్కర్లు, కందవాడ గ్రామ కార్యదర్శి ఎలీషా, సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

విరాళం అందజేత

కడ్తాల్, డిసెంబర్ 17 : సమాజంలో ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్-జగదాంబ ఆలయ నిర్మాణానికి రూ.40 వేల విరాళాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోర్ మోటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన నేనావత్ చంద్రు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా దశరథ్ నాయక్ మంగళవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాధాకృష్ణ ట్రస్ట్ తరపున రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

పశు పోషణలో వైద్యుల సలహాలు పాటించాలి

కడ్తాల్, డిసెంబర్ 17 : పశు పోషణలో వైద్యుల సలహాలు, సూచనలను పాడి రైతులు పాటించాలని మండల పశు వైద్యాధికారి భానూనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు గణన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకల సంఖ్యను సేకరించి నమోదు చేశారు. సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేవీవోలు, వీఏలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

ఆమనగల్లు, డిసెంబర్ 17 : జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆమనగల్లు సెక్టార్ పెన్షనర్ల సంఘం, లయన్స్ క్లబ్ అఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లులోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో జరుపుకొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన 75 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల 25 మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. అనంతరం డీఎస్ నకారా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌కుమార్, మండల విద్యాధికారి పాండు, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, సం